విద్యుత్ చార్జీల పెంపుపై ‘పోరుబాట’

- నేడు ఆత్మకూరులో చేపట్టే బైకు ర్యాలీని జయప్రదం చేయండి
- భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరండి
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టిందని స్థానిక మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని, అక్కడి నుంచి బైకు ర్యాలీగా బయలుదేరి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన తెలియజేస్తూ అధికారులకు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి..

టీడీపీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యాక ఆరు నెలల కాలంలోనే రూ.15,485 కోట్లు విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపారని శిల్పా అన్నారు. తాను అధికారంలో ఉన్న సమయంలో 24 గంటలు కరెంట్ ఇచ్చానని, మిగులు కరెంట్ ఉందని, సోలార్, గాలి ద్వారా విద్యుత్‌ను అందజేస్తానని చంద్రబాబు చెప్పాన్నారు. అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ అని మాయ మాటలు చెప్పి ప్రజలను నమ్మించి గెలుపొందిన తర్వాత ఆ పథకాలను అమలు చేయడం మరిచారన్నారు. కేవలం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు.

మద్యం షాపుల్లో కమీషన్లు

మద్యం టెండర్ల విషయంలో రూ.2 వేల కోట్లు డిపాజిట్లు కట్టించారని, ఆ పార్టీలో పలువురు మద్యం దుకాణాల్లో70 శాతం వాటా ఇవ్వాలని లేదా నెలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు కమీషన్ ఇవ్వాలని దోచుకుంటుందని నిజమా కదా అని శిల్పా ప్రశ్నించారు. ఎక్కడైనా ఉచిత ఇసుక అందుతుందా అని, గతంలో ఆత్మకూరులో కేవలం రూ.800కే టన్ను ఇసుక అందించామని గుర్తు చేశారు. వర్ధన్ బ్యాంకులో తాను వందల కోట్లు దిగిమింగానని ప్రస్తుత ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి విమర్శిస్తున్నారని, మరి ఆయన అధికారంలోకి వచ్చి ఏడు నెలలయ్యిందని, నన్ను ఎందుకు జైలుకు పంపలేదని, ఎప్పుడు పంపుతాడని సవాల్ విసిరారు. తాను ఎమ్మెల్యే కకముందు, రాజకీయాల్లోకి రాకముందు శ్రీశైలం దేవస్థానంలో సెక్యూరిటీ విభాగానికి ఎవరి పేరు మీద ఏజెన్సీ ఉందో కూడా స్పష్టత లేకుండా ఎమ్మెల్యే మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, అహ్మద్‌హుసేన్, మోమిన్, మునీర్‌బాషా, వెంకటస్వామిగౌడ్, జయకృష్ణ, బాలస్వామి, కొత్త రామాపురం రామచంద్రుడు, విజయ్, దర్గమ్మ, షఫీవున్, ఆంజనేయులు, నారాయణరెడ్డి, కనిముల్లాతో పాటు వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీల మోతపై... వైఎస్సార్‌సీపీ పోరుబాట


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: సామాన్య, పేద మధ్య తరగతి కుటుంబాలపై విద్యుత్ చార్జీలు పెంచబోనని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట తప్పిన కూటమి సర్కార్‌కు గుణ పాఠం తప్పదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న పోరుబాటకు పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం విద్యుత్ చార్జీల బాదుడును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఉదయం 10 గంటలకు నందికొట్కూరు పట్టణం చేరుకోవాలని కోరారు.

క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ మంత్రి


ఆలయ రాజగోపురం వద్ద మంత్రి కొండా సురేఖకు స్వాగతం పలుకుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకున్నారు. గురువారం రాత్రి మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు చేరుకున్న మంత్రి కొండా సురేఖకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని దేవస్థాన వర్గాలు తెలిపాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మండల కేంద్రం జూపాడుబంగ్లా సంతగేటు ఆవరణలో గురువారం సైబర్ నేరాలపై ఎస్‌ఐ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సెల్‌నంబర్ల నుంచి ఎవ్వరైనా ఫోన్‌చేసి తాము పోలీసులం అంటూ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం అందజేయాలన్నారు. బ్యాంక్ అధికారులు, పోలీసులు ఎప్పుడు బ్యాంక్ అకౌంట్ల వివరాలు అడుగరని, ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకుని అప్రమత్తంగా మెలగాలని సూచించారు. సమస్యలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ఘర్షణలకు పాల్పడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ


వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న దాతలు న్యాయవాది సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌బీసీ కాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు గురువారం దాతలు దుస్తులు పంపిణీ చేశారు. దాతలు న్యాయవాది సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, సాగర్, రాజశేఖర్ నాయుడు మాట్లాడుతూ వృద్ధులకు మానవతా దృక్పథంతో తమ సంపాదనలో కొంత సాయం అందించాలన్న ఆలోచనతో దుస్తులను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ కృషి


జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మహానంది: ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడూ ముందుంటుందని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో గురువారం వేడుకలు నిర్వహించారు. మండల కార్యదర్శి సామేలు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

మినుముకు పల్లాకు తెగులు


రైతులకు సూచనలిస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: మండలంలోని జమ్మినగర్‌తండా, వెలుగోడులో గురువారం ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో సాగుచేసిన మినుము పంటను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ వెలుగోడు మండలంలో 1285 ఎకరాలు మినుము పంట సాగు చేయగా పైరుకు పల్లాకు తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. ఈ పల్లాకు తెగులు జెమిని వైరస్ వలన వచ్చే తెగులన్నారు. ఈ తెగులు సోకిన మొక్కల ఆకులు, కాయల మీద పసుపు పచ్చ మచ్చలు ఏర్పడతాయని తెలిపారు. తొలిదశలో ఈ వైరస్ తెగులు ఆశించినట్లయితే పైరు గిడసబారి పోయి, పూత పూయక, ఎండపోతుందన్నారు. పైరులో 40-45 రోజుల తరువాత ఆశించినట్లయితే కాయలు పసుపుబారి వంకరలు తిరుగుతాయన్నారు. ఈ వైరస్ తెల్లదోమ ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందని, పల్లాకు తెగులును తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. నివారణకు పైరు చుట్టూ నాలుగు వరుసలు మొక్కజొన్న లేదా జొన్న విత్తుకున్నట్లయితే వైరస్ తెగుళ్లను వ్యాపింపచేసే తెల్లదోమ, తామర పురుగులు, పేనుబంక వంటి రసం పీల్చే పురుగులను నివారించవచ్చని చెప్పారు. పొలంలో తెగులు సోకిన మొక్కలను గమనించిన వెంటనే పీకి నాశనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అంజిత్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగమణి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌లో చీడపీడల నమోదు

ఎన్‌పీఎస్‌ఎస్- నేషనల్ పెస్ట్ సర్వలెన్స్ సిస్టం యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో పంటకు ఆశించిన చీడ పురుగుల వివరాలు ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో నమోదు చేశారు. ఏఓ మాట్లాడుతూ ఈ యాప్‌లో పురుగులు, తెగుళ్లను వివరాలు నమోదు చేస్తే.. ఆ గ్రామ ప్రజలకు యాజమాన్య పద్ధతులు తెలుసుకోవచ్చాన్నారు.

కృష్ణాపురంలో ‘పొలం పిలుస్తోంది’

ఆత్మకూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు పంటల సాగుపై పలు సూచనలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రబీలో పంటలు వేసిన రైతులందరూ తప్పనిసరిగా పంటల నమోదు, పంటల బీమా చేయించుకోవాలన్నారు. గ్రామంలో మినుము పొలాలు సందర్శించి సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమశాఖ అధికారిణి అరుణ, రైతుసేవా కేంద్రం సిబ్బంది నరసింహా, రైతులు పాల్గొన్నారు.

ఒప్పందాల అమలుపై జీఓ జారీ చేయాలి


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు జీఓ జారీ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్, కమిషనర్ రమేష్‌బాబులకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ సంక్రాంతి పండగ కానుకగా ప్రతి కార్మికునికి రూ.1000 ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కరణల ఆర్థిక సాయం పెంచాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు రణధీర్, ఇస్మాయిల్, మున్సిపల్ కార్మికులు రాజేంద్ర, యోహాను, స్వామినాథం, నాగన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి


వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని గోకవరం గ్రామపంచాయతీ మజరా గ్రామమైన బట్టువారిపల్లెలో గురువారం సర్పంచ్ కలబండి మారెన్న అధ్యక్షతన తహసీల్దార్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అనుషారాణి, వీఆర్వోలు శ్రీనివాసులు, వేణుగోపాల్ గౌడ్, మౌలాలి, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 56 వినతులు

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు, పీరుసాహెబ్ పేట గ్రామాల్లో గురువారం తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 56 వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జహంగీర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు గణపురంలో రెవెన్యూ సదస్సు

పగిద్యాల: మండలంలోని ఎం. ఘణపురం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తనతోపాటు డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో, ఆర్‌ఐ, సర్వేయర్ అందుబాటులో ఉంటారన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

మిడుతూరు: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. గురువారం మండల పరిధిలోని చౌట్కూరు గ్రామంలో క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని నిర్వహించిన కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా సుంకేసుల గ్రామానికి వెళ్లి మహేష్‌కు రూ. 62, 905 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాంభూపాల్‌రెడ్డి, గుండం సర్వోత్తమరెడ్డి, గౌడు, సోఫిసాహెబ్, సంఘం పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో మహాశివరాత్రి ఏర్పాట్లు


పూజలు నిర్వహించి పనులు ప్రారంభిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 11 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయనున్నారు. గురువారం ఆలయ మాడవీధిలో చలువపందిళ్ల పనులు ప్రారంభమయ్యాయి. శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఈఈ ఎం.నరసింహారెడ్డి పూజాదికాలు జరిపి పనులు ప్రారంభించారు. ఆలయ మాడవీధులు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, ఉద్యానవనాలు, దేవస్థాన సత్ర ప్రాంగణాలు, ఆరుబయలు ప్రదేశాల్లో చలువపందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో వీలైనన్ని ఎక్కువ ప్రదేశాల్లో చలువపందిళ్లు వేయాలని సూచించారు. అన్నిచోట్ల తగినంత విద్యుద్దీపాలను, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, ఫిబ్రవరి మొదటి వారంలోపు పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సచివాలయాల్లో ఎస్సీ కులగణన సర్వే జాబితా ప్రదర్శన

పగిద్యాల: ఎస్సీ కులగణన సోషల్ ఆడిట్ ప్రక్రియలో భాగంగా మండలంలోని పది గ్రామ సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలను గురువారం నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ పేర్కొన్నారు. జాబితాలో ఏమైన్నా అభ్యంతరాలు ఉంటే ఈనెల 31వ తేదీలోగా వీఆర్వోకు అర్జీ ఇచ్చి సవరించుకోవాలని సూచించారు. అభ్యంతరాలను జనవరి 6 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం జనవరి 10న కుల గణన తుది జాబితాను సచివాలయాల నోటీస్ బోర్డుల్లో మళ్లీ ప్రదర్శిస్తారన్నారు.

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఎస్సీ కుల గణన సర్వే వివరాలను గురువారం నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించారు. ఈ మేరకు ఎంపీడీఓ చంద్రశేఖర్ మిట్టకందాల గ్రామ సచివాలయాన్ని సందర్శించి కుల గణన ఆడిట్ వివరాల ప్రదర్శనను తనిఖీ చేశారు.

మద్దతు ధర కల్పించాలి

నందికొట్కూరు: రైతులకు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఏఐయుకేఎస్ అధ్యక్షుడు వేల్పుల అర్లప్ప డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. మద్దతు ధర కల్పించాలంటూ ఢిల్లీ సరిహద్దులో శాంతి యుతంగా ఆందోళన చేపడితే కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, మనోహర్‌గౌడ్, మహేంద్ర, వెంకటేష్, రాజు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన జి.మంజుల వారిచే నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమం పలువురు భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతి నమో నమః, పన్నగభూషణ, శివ శివ, బ్రహ్మమురారి సురార్చితలింగం, కాశీవిశ్వనాథాష్టకం, శివాష్టకం, శివస్తోత్రం పలు గీతాలు, అష్టకాలను మంజుల, సంగీతలక్ష్మి తదితరులు ఆలపించారు. కీబోర్డు పి.శ్రీనివాసరావు, తబలా సహకారాన్ని టి.గురురాజ అందించారు.

బెల్లంఊట ధ్వంసం

ఆత్మకూరు: మండలంలోని సిద్దాపురం గ్రామ అటవీ ప్రాంతంలోని బవనాసివంక ప్రాంతంలో గురువారం నాటుసారాకు ఉపయోగించే 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వీరస్వామి, ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని ప్రజలు తమ సెల్ 94409 02585, 91772 99067, 83283 07774 నంబర్‌లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: పట్టణంలోని సర్వీస్ ప్రొవైడర్స్ ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీసర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ రిపేర్, బ్యూటీ షియన్స్(మహిళలు, పురుషులు)కు నైపుణ్య అభివృద్ధి శిక్షణ సంస్థ ద్వారా శిక్షణ ఇవ్వనునట్లు మెప్మా సీఎంఎం శాంతకుమారి తెలిపారు. శిక్షణలో సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఈ నెల 30లోపు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ సుబ్రహ్మణ్యం

జూపాడుబంగ్లా: గ్రామీణ యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, జూపాడుబంగ్లా ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని పారుమంచాలలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో గెలుపు, ఓటమి అనేది సహజమన్నారు. ఓటమిని గెలుపునకు బాటగా భావించి క్రీడల్లో ముందడుగు వేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సీఐ, ఎస్‌ఐని సత్కరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి


పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

మహానంది: శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు కృషి చేయాలని డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మహానంది పోలీస్ స్టేషన్‌లో గురువారం రికార్డుల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహానంది క్షేత్రానికి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆలయ పరిధిలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అదుపులోకి తీసుకొని విచారణ చేయాలన్నారు. భక్తుల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొలతల మేరకు పనులు చేయాలి


ఉపాధికూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ గౌరీబాయి

జూపాడుబంగ్లా: ఉపాధి కూలీలు నిర్ణీత కొలతల ప్రకారంగా పనులు చేస్తే గరిష్టస్థాయిలో కూలీ వర్తిస్తుందని ఏపీఓ గౌరీబాయి తెలిపారు. గురువారం ఆమె తాటిపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె కూలీల హాజరు లిస్టులను పరిశీలించారు. ఒక్కొక్కరు 6మీటర్ల మేర ఉపాధి పనులు చేస్తే రూ.270ల మేర కూలి గిట్టుబాటు అవుతుందని తెలిపారు. పనుల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని ఫీల్డ్ అసిస్టెంటు లింగన్నకు సూచించారు.

ప్రజల పక్షాన అలుపెరగని పోరాటాలు


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నందికొట్కూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన అలుపెరగని పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురామ్మూర్తి పిలుపునిచ్చారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం పటేల్ సెంటర్‌లో నాయకులు జెండాను ఎగరవేశారు. సీపీఐ కార్యాలయం నుంచి కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రజితమ్మ, రాముడు, మౌలాలి, శ్రీనివాసులు, వీరస్వామి, పోచయ్య,షేక్షావలి, రామాంజనేయులు, రాంబాబు, దినేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లి బస్టాండ్ ఆవరణలో సీపీఐ మండల కార్యదర్శి కేతం వెంకటేశివుడు యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శతజయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా జెండా ఆవిష్కరణ చేశారు. సీపీఐ పోరాటాలను ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు భీమలింగం, లింగమయ్య, నరసింహుడు, పుల్లయ్య నాయక్, శివ, వెంకట లింగం, గోవిందు, శివలింగం, మహేష్, శ్రీను, జయరాం, లింగస్వామి, వెంకట్ రాముడు, అంజి, ఐస్వామి,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లాతోపాటు తంగడంచ, చాబోలు గ్రామాల్లో గురువారం సీపీఐ వందేళ్ల ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రజల పక్షాన ప్రభుత్వాలపై సీపీఐ నిరంతర పోరాడుతుందని ఆ పార్టీ నాయకుడు రమేష్‌బాబు తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేత మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, చక్రపాణి, శ్రీను, సుధాకర్, జాకీర్, సలీం, మనోహర్, రమణ, నాగన్న, శేఖర్, మగ్బుల్ బాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.


వరి ధాన్యం తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం

మహానందిలో వర్షం

మహానంది: తుపాను ప్రభావంతో గురువారం మహానంది ఆలయ పరిసరాలతో పాటు సమీప గ్రామాల పరిధిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు వర్షంలో తడవకుండా ఉండేందుకు ఆలయ ప్రాంగణంలోని మండపాల్లో సేద తీరుతూ కనిపించారు. పంట పొలాల్లో వరి ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు దిగుబడి తడవకుండా ప్లాస్టిక్ పట్టలు కప్పుకుంటూ కనిపించారు. అసలే ధర అంతంత మాత్రమే ఉండడంతో పాటు అకాల వర్షాలతో అన్నదాతల ఆవేదన వర్ణనాతీతం.